# సూర్య
మేటి దినపత్రిక
www.suryaa.com
చిత్తూరు తిరుపతి
గురువారం | 06 మార్చి 2025 | పేజీలు 8


## గిరిజన గురుకుల పాఠశాలలో టీచర్ల కొరత

**రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి**



**పుంగనూరు, మేజర్‌న్యూస్ :** గిరిజన గురుకుల బాలికల సంక్షేమ పాఠశాలను బుధవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి తనిఖీలు నిర్వహించారు ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాల నందు టీచర్ల కొరత ఉందని వీరికి జీవో ప్రకారం విద్యార్థులకు అందివ్వాల్సిన మెన్యు కూడా సరిగా తెలియదు అన్నారు. వారానికి రెండు మూడు సార్లు పిల్లలకు చికెన్ ఇవ్వాలని ఆయన తెలిపారు. అలాగే అంగన్వాడి కేంద్రాలను పలు పాఠశాలను ఆయన సందర్శించారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాము, ఎంఈఓ చంద్రశేఖర్, ఆర్ఐ పనింద్ర ఐసిడిఎస్ రాజేశ్వరి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నీటి సమస్యలకు తక్షణ పరిష్కారం

- నగరపాలక సంస్థ పరిధిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు
- నీటి సమస్యల ఫిర్యాదు కోసం 9849907885
- కమిషనర్ నరసింహ ప్రసాద్



**చిత్తూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఏ ప్రాంతంలోనైనా నీటి సమస్యలు ఉత్పన్నమైతే ఆ సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు అవసర మైన అన్ని చర్యలను తీసుకోవడం జరిగిందని చిత్తూర్ నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ పేర్కొన్నారు. -మిగతా 2లో

## బాల్య వివాహాలు సమాజానికి చేటు



**చిల్లకూరు, మేజర్‌న్యూస్ :** మహిళా దినత్సవం సందర్భంగా బాల్య వివాహాలు, బాలింతలు చిన్నారుల ఆరోగ్యంపై అవగాన కార్యక్రమం నిర్వహించారు. చిల్లకూరు మండలం నెలబల్లి రెట్టపల్లి గ్రామం లోని అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుక మాట్లాడుతూ.. బాలింతల ఆరోగ్యం బాలికల సంతోషంపై చిన్నారులు తల్లులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు కూడ తమ పిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేయకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగ్‌వాడి కార్యకర్త మస్తానమ్మ, హెల్పర్ సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

## అధికారులే అండదండై..



# ఎర్ర బంగారం అమ్మేస్తున్నారు!

- వంతులు వారిగా డ్యూటీలు
- విచ్చలవిడిగా తవ్వకాలు
- పంట పొలాలు గోతులుమయం
- కోట్ల రూపాయలు దళారులమయం

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ :** అక్రమాలను అడ్డుకోవలసిన అధికారులు అదే అక్రమార్కులతో చేతులు కలిపారు.. అన్యాయంగా రైతులు నోళ్ల కొట్టి పంట పొలాలను ధ్వంసం చేసి జేబులు నింపుకుంటున్న దోపిడిదారులకు బాసటగా నిలిచారు.. వారు విసిరే ఇంగిలి మెతుకులకు ఆశపడి కోట్ల విలువ చేసే ఎర్ర బంగారం తరలింపుకు నిలువుగా తల ఊపేశారు.. అడ్డుకోవలసిన అధికారులే కొండంత అండగా నిలవడంతో గ్రావెల్ దోపిడి మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది.

వివరాల్లోకి వెళితే.. దొరవారిసత్రం మండలం పూలతోట మిట్ట గ్రామంలో స్వయన అధికారుల పర్యవేక్షణలో భారీగా గ్రావెల్ దందా నడుస్తుంది. గత నెల రోజులుగా జరుగుతున్న ఈ దందాపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో గ్రావెల్ దందాను అరికట్టాల్సిందిగా జిల్లా కలెక్టర్ స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో దొరవారిసత్రం తహసిల్దారు గ్రావెల్ తరలింపు జరుగుతున్న పూలతోటమెట్టలో రోజుకు ఒక విఆర్ఓను, ఒక వీఆర్ఏను డ్యూటీలు వేస్తున్నట్లు పై అధికారులకు రాతపూర్వకంగా తెలియజేశారు. విచిత్రం ఏమిటంటే.. పైకి గ్రావెల్ రవాణాను అడ్డుకునేందుకు సిబ్బందిని నియమిస్తున్నట్లు పై అధికారులకు తెలిపి.. అదే సిబ్బంది చేత ఇక్కడ అధికారులు ఈ దందాను దగ్గరుండి జరిపిస్తున్నారు. అధికారుల ప్రవర్తిస్తున్న తీరును చూసి స్థానికులు ఆశ్చర్యకతులై చేనే గడ్డి వేస్తే మేము ఎక్కడికి వెళ్లాలి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కోట్ల దందాలో ఎవరి భాగం ఎంత?

దొరవారి సత్రం మండల పరిధిలోని పూలతోటమిట్ట గ్రామంలో జరుగుతున్న గ్రావెల్ దందా ముగ్గురు పర్యవేక్షణలో సాగుతూ ఉంది. ఒకరు -మిగతా 2లో

## అధికారుల నిర్లక్ష్యం..



# జాతీయ రహదారి ఆక్రమణ

- అధికారం.. ఏదైతే ఏమిటి!
- రూ.40 కోట్ల విలువైన భూమి ఆక్రమణ
- ఆక్రమణలపై కఠిన చర్యలు : తహసిల్దార్

**గూడూరు, మేజర్‌న్యూస్ :** జాతీయ రహదారినే ఏకంగా ఆక్రమిస్తున్నా నిత్యం అటు ఇటు తిరిగే అధికారులు చోద్యం చూస్తున్న వైనమిది. అధికారంలో ఎవరుంటే వారికి అడుగులకు మడుగులొత్తే అధికార యంత్రాంగం ప్రభుత్వానికి దఖలు పడిన భూములను సకాలంలో స్వాధీనం చేసుకో లేని నిర్లక్ష్యంతో ఇప్పటికీ సీలింగ్.. ఇనాం.. దేవాదాయ శాఖ భూములు రావణ కాష్టంలా రగులుతూనే ఉన్నాయి. విలువైన భూములు పరులకు వదిలి కావల్సిన వాటిని పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి సేకరించడమే అధికారుల పనిగా మారింది. డివిజన్ పరిధిలోని డివిఆర్ పురం (రైటార్‌సత్రం) వద్ద పాత ఎన్‌హెచ్-5 జాతీయ రహదారిని పట్టా ముసుగులో ఆక్రమిస్తున్నారు. డివిఆర్ పురం వద్ద గతంలో వాజ్‌పాయ్ ప్రధానిగా ఉన్న సమయంలో చేపట్టిన స్వర్ణ చతుర్భుజి నిర్మాణంలో భాగంగా భారీగా ఉన్న మలుపును సరిదిద్దే క్రమంలో కోట క్రాస్ రోడ్డు వరకు పాత రహదారిని వదిలి భూసేకరణ జరిపి కొత్తగా నిర్మాణం చేశారు. దీంతో పాత రహదారి దాదాపుగా వదిలి వేయడంతో ఇప్పటి వరకు అలానే ఉండి పోయింది. అయితే ఈ ప్రాంతంలో భూములు సీలింగ్‌లో వదిలిన భూస్వామి అక్కడా.. ఇక్కడ అంటూ వదిలిన భూములను తిరిగి అనుభవంలోకి తీసుకుంటున్నా రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సీలింగ్‌లో భూములు వదిలిన తర్వాత ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం చేయడం కొన్ని చోట్ల సమస్యలకు కారణం అవుతోంది, ఆ సమస్యాత్మక గ్రామాల్లో -మిగతా 2లో

## చెరువులు, కాలువలు..

# ఆక్రమిస్తే ఉపేక్షించొద్దు

**కమిషనర్ ఎన్.మౌర్య**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ :** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఎవరైనా చెరువులు, కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఉపేక్షించవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని పాన్ చెరువు, గణేష్ లేఔట్, సాయి విష్ణు లేఔట్, జన చైతన్య లేఔట్, అన్నమయ్య మార్గం రోడ్డు తదితర ప్రాంతాలను డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, -మిగతా 2లో

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



**చిట్టమూరు, మేజర్‌న్యూస్ :** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని చిట్టమూరు ఎస్సై చిన్న బలరామయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రానికి కూడలి ప్రాంతమైన కొత్తగుంటలో వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ఆటోవాలాలు మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, లెక్కకు మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తప్పవన్నారు. వాహనాలకు సంబంధించి తీసుకోవాలని ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలకు జెరిమానా విధించారు. ఆయన ఏఎస్ఐ నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. జాతీయ రహదారి ఆక్రమణ

*(మొదటి పేజీ తరువాయి)*

ముత్యాలపాడు గ్రామం కూడ చేరింది. ఇక్కడ దువ్వూరు నారాయణరెడ్డి కుటుంబం నుంచి అల్లారెడ్డి శ్యామసుందరరెడ్డికి సంక్రమించిన భూముల లెక్కలు తేలక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సీలింగ్‌లో భూములు వదిలి దశాబ్ధాలు అవుతున్నా ఇంకా తమ భూములు ఇక్కడ.. అక్కడ ఉన్నాయంటూ వాజ్యాలు ఫర్యాదులు చేస్తూ రెవెన్యూ చట్టాలనే అపహాస్యం చేస్తున్నారు. ఆ కుటుంబాల మధ్యనే రెవెన్యూ అధికారులు ఆజ్యం పోస్తూ వాజ్యాలకు కారణం అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ వివాదాల నడుమ క్రయ విక్రయాలు చేసుకుంటూ రెవెన్యూ అధికారులు మాయాజాలంతో అబ్ది పొందుతున్నారు. అప్పట్లో ఈ భూములు నిరుపయోగమైనవి కావడంతో ప్రభుత్వానిఇక సీలింగ్‌లో వదిలిన భూస్వాములు ప్రస్తుతం ఆకాశాన్నంటున్న ధరలతో ప్రభుత్వ నిర్వహంతో ఇప్పటికీ ఖాళీగా ఉన్న ఆ భూములపై కన్నేసి రాజకీయ నాయకుల కనుసన్నల్లో భారీగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అందులో భాగంగానే ముత్యాలపాడు రెవెన్యూ పరిధిలోని భూముల వ్యవహారంలో ఆక్రమణలు, అడ్డగోలు వ్యవహారాలు చోటు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారం అడ్డు పెట్టుకుని ఈ భూములను కైవసం చేసుకుంటున్న నాయకులు అక్కడున్న కొద్ది పాటి పట్టా భూమితోపాటు ప్రభుత్వ భూములు ఆక్రమించుకుంటున్నారు. ఇక్కడ రియల్ ఎస్టేట్ వెంచర్ వేసిన ఒక నాయకుడు అధికార పార్టీని అడ్డు పెట్టుకుని భారీ అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు లేకనే భారీ వెంచర్ శర వేగంగా సాగిస్తున్నట్లు తెల్సింది. రియల్టర్ కొనుగోలు చేసిన భూముల్లో భాగంగా 16వ నంబర్ జాతీయర రహదారికి పాత జాతీయ రహదారి (ఎన్‌హెచ్-5) మధ్యన ఉన్న భూమి కూడ కొనుగోలు చేసిన దానిలోనిదే అంటూ అక్కడ ఉన్న గుంటలు పూడ్చి వేసే నెపంతో పాత జాతీయ రహదారిని సరిచేసుకుని మొత్తం ఆక్రమించేందుకు సిద్ధం చేసుకున్నారు. పాత జాతీయ రహదారి సర్వే నంబర్ 437లో 4.05 ఎకరాల భూమిని రియల్ వెంచర్‌లో కలుపుకొనేందుకు సిద్ధం చేసుకున్నారు. రియల్టర్‌కు సర్వే నంబర్ 438లో 1.13 ఎకరాల భూమి మాత్రమే ఎన్‌హెచ్15 ఆనుకుని ఉన్నట్లు తెల్సింది. దీన్ని చదును చేస్తూ సర్వే నంబర్ 437లోని భూమిని కలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తూ రహదారిని చదును చేసినట్లు తెల్సింది. దీనిపై జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులను అడిగినా నిర్లక్ష్యమే సమాధానంగా ఉంది. దాదాపు 40 కోట్ల రూపాయలు విలువ చేసే భూమిని కాపాడుకుంటే ప్రభుత్వ అవసరాలకు ఉపయోగ పడే అవకాశం ఉంది. ఈ భూమిని ప్రభుత్వమే మార్కెట్ ధరకు ఉంచి వేలం వేస్తే భారీ మొత్తంలో లేదంటే ఈ ఆక్రమణపై బిజెపి తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బైరప్ప ఎన్‌హెచ్ అధికారులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. దీనిపై తహసిల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా పాత జాతీయ రహదారి ఆక్రమణకు గురి కాలేదని అలాంటి చర్యలకు అవకాశం లేదని త్వరలో ఆ భూమిని ప్రత్యేకంగా గుర్తించి బోర్డు పెడతామన్నారు.

# అధికారులే అండదండై.. ఎర్ర బంగారం అమ్మేస్తున్నారు !





*(మొదటి పేజీ తరువాయి)*

ప్రతిపక్ష పార్టీకి చెందిన రాష్ట్రస్థాయి నాయకుడి అనుచరుడు ఒకరైతే, మరో ఇద్దరు అధికార పార్టీకి చెందిన వారు కావడం విశేషం. ఇక్కడ జరుగుతున్న ఈ గ్రావిల్ దోపిడీలో రోజుకు 70లారీలు గ్రావిల్ చెన్నైకు తరలి వెళ్తుంది. ఒక లారీ గ్రావెల్ ధర అక్కడ 35వేల రూపాయలు పలుకుతుంది. అంటే 70 లారీలకు గాను 24.50 లక్షల రూపాయలు ఒక రోజుకి వీరికి గిట్టుబాటు అవుతుంది. ఈ లెక్కన నెలకు 7.35కోట్ల రూపాయల గ్రావిల్ ఇక్కడి నుంచి తరలి వెళ్తుంది. ఈ దందా కొనసాగిస్తున్న నాయకులకు ఒక లారీకి వేరువేరు భాగాలు ఉంటాయి. పూల తోటలో గ్రావిల్ ను దగ్గరుండి లారీకి లోడ్ చేసే నాయకుడికి ఒక లారీకి 6000 రూపాయలు భాగం చెందుతుంది. అంటే ఒక రాత్రికి 70 లారీలకు గాను ఈ నాయకునికి 4.20 లక్షల రూపాయలు ముడుతుంది. ఇక్కడినుంచి తరలించే గ్రావిల్‌ను ఎక్కడ.. ఎవరికి పంపాలో నిర్ణయించి, ఎలాంటి అధికారుల ఇబ్బందులు లేకుండా చూసుకునే మరో నాయకునికి ఒక లారీకి తొమ్మిది వేల రూపాయలు చెందుతుంది. అంటే ఒక రాత్రికి 6.30లక్షల రూపాయలు ఆనాయకునికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రకారంగా ఈ నాయకుడు నెలకు1.9 కోట్ల రూపాయలను పేదల కడుపు కొట్టి కొల్లగొట్టేస్తున్నాడు. ఈ దందాలో ప్రతిపక్ష పార్టీకి చెందిన రాష్ట్రస్థాయి నాయకుడు అనుచరుడు లారీలను పెట్టి ఆ లారీలు బాడుగలను మిగిలిన పైకాన్ని ఆయన ఖాతాలో జమ చేసుకుంటాడు. ఈ లెక్కన ఒక నెలలో సుమారు ఎనిమిది కోట్ల రూపాయలను రైతులు కడుపు కొట్టి దళారులు కొట్టేస్తున్నారు. వీరికి కుమ్మకాస్తూ వీరి దందాకు సహకరిస్తున్న అధికారులకు వీరు నెలసరి మామూలు అందజేస్తూ అధికారులను తమ చెప్పు చేతల్లో పెట్టుకుని ఈ దందాకు పావులుగా ఉపయోగించుకుంటున్నారు.

## పంట పొలాలు గోతుల మయం

పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన పంట పొలాలు ఈ దళారులు పుణ్యమా అంటూ గోతుల మయమై దర్శనమిస్తున్నాయి. పొలాల్లో దోపిడీదారులు 20 అడుగుల నుంచి 30 అడుగుల మేర గోతులు తీసి ఈ పొలాలు ఎందుకు కొరగానివిగా తయారు చేస్తున్నారు. ఈ భూములు 1992లో స్థానికంగా ఉన్న గిరిజనులకు ప్రభుత్వం సిజెఐఎఫ్ఎస్ పట్టాలు అందజేసింది. అయితే గిరిజనులు ఆ పొలాన్ని సాగు చేసుకోకుండా స్థానికంగా ఉన్న కొంతమందికి 1000కి 2000కి విక్రయించేశారు. 2018 సంవత్సరంలో సీజేఎఫ్ భూములను అప్పటి ప్రభుత్వం డీకేటీగా మార్చడంతో వెయ్యికి రెండు వేలుకు కొన్న వారి సొంతమైపోయాయి. అయితే వీరు ఈ ప్రభుత్వ భూముల్లో పంటలు వేసుకోకుండా పొలాల్లో గ్రావిల్ అధికంగా ఉండటంతో లక్షా రెండు లక్షలకు పొలాలను దోపిడిదారులకు అప్పజెప్పేస్తున్నారు. ఈ పొలాలను కొల్లగొట్టి దోపిడీదారులు కోట్లు గడిస్తున్నారు.

# చెరువులు, కాలువలు ఆక్రమిస్తే ఉపేక్షించొద్దు

*(మొదటి పేజీ తరువాయి)*

హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ముఖ్యంగా పాన్ చెరువులో అనధికార నిర్మాణాలు చేస్తున్నారని, పలు లే ఔట్లలో కాలువలు ఆక్రమించినట్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పిర్యాదులు వస్తున్నాయని అన్నారు. నగరంలోని చెరువులు, కుంటలు, కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేస్తే కఠినచర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తున్నారని వారిని గుర్తించి జరిమానాలు విధించాలని ఆదేశించారు. అలాగే నగరంలో పలు డ్రెయినేజీ కాలువలపై అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ వాహనం వెళ్లేలా చూడాలని హెల్త్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తుడా ఎస్‌ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి సేతు మాధవ్, డిసిపి మహాపాత్ర, ఏసిపిలు బాలాజీ, మూర్తి, డీఈ రమణ, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

# నీటి సమస్యలకు తక్షణ పరిష్కారం

*(మొదటి పేజీ తరువాయి)*

బుధవారం ఆయన స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో చిత్తూర్ నగర పాలక సంస్థ పరిధిలో 50 డివిజన్లో వేసవి దృష్ట్యా ఏర్పడే నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు అవసరమైన అన్ని ప్రణాళికలు సిద్ధం చేసి ప్రజలకు నీటి సమస్య లేకుండా చూస్తామని అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో ఎక్కడైనా నీటి సమస్య ఉన్నట్లయితే తక్షణం ఆ సమస్యను నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు సమస్యల పరిష్కారం కోసం 9849907885 నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని ఈ నెంబర్కు ఫోన్ ద్వారా గాని వాట్సాప్ ద్వారా గాని సంబంధిత ప్రాంతము పేరు సమస్యను తెలియజేయవచ్చునని తక్షణం ఆ ప్రాంతంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ యంత్రాంగం చర్యలు చేపడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వేసవి దృష్ట్యా నేటి సమస్య ఏర్పడకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని ఇది వారిలోనే చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ఆదేశించారని ఆయన ఆదేశాల మేరకు చర్యలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. అలాగే ప్రజలకు నగరపాలక సంస్థ ద్వారా నగరపాలక సంస్థకు సంబంధించిన ఇతర సమస్యలు ఉన్నట్లు అయితే కూడా దానిని ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమంలో అందించవచ్చునని అన్నారు. అలాగే డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయంలో సైతం ప్రజలు తమ సమస్యలను ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేయవచ్చునని ఈ సందర్భంగా కమిషనర్ నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు.

# ఛలో పిఠాపురం పోస్టర్లు ఆవిష్కరణ



**గూడూరు, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ ఆవిర్భావం నుండి అభివృద్ధి వరకు తోడు ఉన్న ప్రతి ఒక్కరు ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తీగల చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ.. మార్చి 14న పిఠాపురం చిత్రాడలో జరగనున్న జనసేన 12వ ఆవిర్భావ సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి జనసైనికులు సభకు తరలి వచ్చేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పిఓసి మోహన్ పట్టణ ప్రధాన కార్యదర్శులు వంశీ కృష్ణ, కుమార్, కార్యదర్శులు ఉప్పు సాయికిరణ్, పెంచలయ్య, సుమన్, ప్రవీణ్, మురళి, శివ, భరత్, గురు, తేజ, రాజు, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

# శాసనమండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం

## చంద్రబాబు పాలనకు ప్రజామోదం

**కోట, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని రెండు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీల కూటమి అభ్యర్థుల ఘన విజయంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,యవనేత నారా లోకేష్ ,భారతీయ జనతా పార్టీ ల సమర్ద పాలనకు ప్రజామోదం లభించినట్లయినదని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. కోటలో బుధవారం మాట్లాడుతూ.. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, కృష్ణ గుంటూరు జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ లు మొత్తం చెల్లుబాటు అయిన ఓట్లలో 67 శాతానికి పైగా ఓట్లను పొంది ఘన విజయం సాధించారన్నారు.గత ఏడాది మే లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన భారతీయ జనతా పార్టీ కూటమి 57 శాతం ఓట్లతో 164 స్థానాలు సాధించి అఖండ విజయం సాధించగా, ఇపుడు మొత్తం 175 శాసనసభ స్థానాల్లో 67 శాసనసభ స్థానాల పరిధిలో విస్తరించి ఉన్న ఉభయ గోదావరి జిల్లాల, కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాలలో మూడింట రెండు వంతులకు పైగా ఓట్లను సాధించి కూటమి అభ్యర్థులు గత శాసనసభ ఎన్నికల కంటే పది శాతానికి పైగా అధికంగా ప్రజామోదాన్ని పొందారన్నారు. ఈ విజయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గత తొమ్మిది నెలల పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు లభించిన మద్దతని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో 108 నియోజకవర్గాలలో విస్తరించి ఉన్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం, తూర్పు రాయలసీమ, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గాల్లో



తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో మొదలైన తెలుగుదేశం నేతృత్వం లోని కూటమి జైత్రయాత్ర రోజు రోజుకు అన్ని వర్గాల ప్రజల సమర్ధనతో దిగ్విజయంగా సాగుతోందన్నారు. గత ఐదేళ్ల వైకాపా అరాచక, అభివృద్ధి నిరోధక, అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధ,ఆటవిక పాలనతో విరక్తి చెందిన రాష్ట్ర ప్రజలు వైకాపాని కేవలం 11 స్థానాలకు పరిమితం చేసినా బుద్ధి మారలేదని, పట్టభద్రుల నియోజకవర్గాలలో వైకాపా తరపున అభ్యర్థులను పోటీ కూడా పెట్టలేని వైకాపా తన సాక్షి ఛానల్ ద్వారా కూటమి అభ్యర్థుల విజయాన్ని తక్కువ చేసి చూపుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నదని, అన్ని విషయాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లోనైనా కూడా వైకాపాను భూస్థాపితం తప్పదని రాధాకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర శాసనమండలిలో పట్టభద్రులకు కేటాయించిన ఐదు శాసనమండలి నియోజకవర్గాల్లో తెలుగుదేశం కూటమి అభ్యర్థులే విజయం సాధించడంతో రాష్ట్రంలోని విద్యావంతులు, యువకులు, నిరుద్యోగులు, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వానికి ,సమర్థ పాలనకు సంఘీభావం తెలిపినట్లు అయిందన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులు తల్లిదండ్రుల సమావేశం



**వాకాడు, మేజర్‌న్యూస్ :** కోట ప్రాజెక్టు పరిధిలోని వాకాడు మండలం నెల్లిపూడి పంచాయితీ వెంకటరెడ్డిపాలెం గ్రామం అంగన్వాడీ కేద్రంలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ప్రతినెల 5వ తేదిన జరుపుకునే వేడుకయర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా పిల్లలకి ఆట, మాట, పాట, కథలు, సృజనాత్మకత, సంసిద్ధతతో కూడిన అంగనవాడీ విద్యను పిల్లలకు,తల్లకు అవగాహన కల్పించారు. ప్రవేట్ విద్యా విధానంలో డబ్బులు పెట్టుకోవాలి. అంగన్వాడి కేంద్రాలలో అన్ని గవర్నమెంట్ ఇస్తూ వాళ్ళకి ఆరోగ్యంగా ఉన్నారా లేదా పిల్లలు బరువులు తో పాటు వైద్య పరీక్షల నిమిత్తం ప్రతి నెలా ఏ యన్ యం,సి హెచ్ ఒ,ఎంపీహెచ్, కూడా ప్రతినెలా వచ్చి చెకప్ చేస్తారు.అలాగే 104 కూడా ప్రతినెలా వచ్చి పిల్లలను చెకప్ చేస్తారు. పిల్లలని ఆనందంగా ఉండేలా అంగనవాడీ కేంద్రంలో ఉన్న ఆటలు,పాటలు, కథలు ద్వారా పిల్లలు సంతోషంగా గడుపుతారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా అంగన్వాడి కేంద్రాలు పని చేస్తాయని ఈసీసీఈడే ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో అంగనవాడీ టీచర్ చెన్నమ్మ. ఏ నాగమణి, వి నవరత్న, ఆశ వర్కర్ ఏ సావిత్రమ్మ, పిల్లలు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## తిప్పవరప్పాడులో ఈసీసీఈ దినోత్సవం




**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మహిళా దినత్సవం సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలన అనర్థాలపై అవగామన కార్యక్రమం నిర్వహించారు. గూడూరు మండలం తిప్పవరప్పాడు గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ మెహబూబి మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం బాలికల సంతోషంపై చిన్నారులు తల్లులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పాఠశాలలో చిన్నారుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. తల్లిదండ్రులు కూడ తమ పిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేయకుండా సహకరించాలని కోరారు. పెళ్లి వద్దు చదువు ముద్దు నినాదంతో బాలికలలో చెతన్యం నింపుతూ ర్యాలీగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగ్‌వాడి సూపర్‌వైజర్, చెంచులక్ష్మి డాక్టర్ మేని, ఎఎన్ఎం పుష్పలత, కార్యకర్త మంగమ్మ హెల్పర్ శిరీష. ఆషాలు తదితరులు పాల్గొన్నారు.

## నిడిగుర్తిలో జియోట్యాగింగ్ సర్వేను పరిశీలన : ఎంపీడీఓ

**వాకాడు, మేజర్‌న్యూస్ :** వాకాడు మండలం నిడిగుర్తి గ్రామ సచివాలయ పరిధిలోని గొల్లపాలెం గ్రామంలో బుధవారం ప్రభుత్వం చేపట్టిన పి 4 సర్వే, హౌస్ టు హౌస్ జియో ట్యాగింగ్ సర్వేను ఎంపీడీవో శ్రీనివాసులు పరిశీలించారు. నిడిగుర్తి గ్రామంలో ఉన్న సచివాలయాన్ని ఎంపీడీవో శ్రీనివాసులు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు, సచివాలయం సిబ్బందితో ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజలకు అందుబాటులో ఉండి రానున్న ప్రభుత్వ పథకాలతోపాటు సంక్షేమ పథకాలు, పంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. అనంతరం హౌస్ టు హౌస్ జియో ట్యాగింగ్ సర్వేను ఎంపీడీవో పర్వేక్షించి పలు సూచనలు సలహాలను అందజేశారు. ఆయన వెంట మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



## రోటరీ వెస్ట్‌చే ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు




**గూడూరు, మేజర్‌న్యూస్ :** గూడూరు రోటరీ క్లబ్ ఆద్వర్యంలో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు అవార్డ్‌లను రోటరీ డిస్ట్రిక్ట్ 3160 గవర్నర్ రోటేరియన్ సిఎ సాధుగోపాలకృష్ణ అందచేశారు. బొమ్మిరెడ్డి రోటరీ కన్వెన్షన్ సెంటర్ భవనంలో రోటరీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తమ విధులను ఉన్నతంగా నిర్వహించిన ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులకు పిడీజీ తారాచంద్ దుగార్ దాతృత్వంతో వోకేషనల్ అవార్డులు బహుకరించారు. పదిమంది ఇంజనీరింగ్ విద్యార్థులకు దొడ్ల రుక్మిణమ్మ రోటరీ స్కాలర్షిప్ అందచేశారు. నూతన సభ్యులను రోటరీ క్లబ్ నందు డిస్ట్రిక్ట్ గవర్నర్ ద్వారా చేర్పించడమైనది మరియు డిస్ట్రిక్ట్ రొటారక్ట్ రెప్రజెంటేటివ్ సెక్రటరీ తేజ ద్వారా దువ్వూరి రమణమ్మ ఉమెన్స్ కాలేజిలో రోటారాక్టు క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సమక్షంలో ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి ప్రసంగిస్తూ ఈరోజు గవర్నర్ అధికారిక పర్యటనకు రావడం చాలా ఆనందంగా ఉందని అభినందనలు తెలిపారు. రోటరీ క్లబ్ ఉన్నతి కి కృషి చేస్తానని, పల్స్ పోలియో ప్రోగ్రాం ప్రజల్లోకి తీసుకుపోతామని, మా క్లబ్ ద్వారా కార్యక్రమాలు చేసామని, ఇంకా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పీడీజీ సురేంద్ర పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ దశరథరామిరెడ్డి డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి కార్యదర్శి రోటేరియన్ జి.జి.నాయుడు రోటేరియన్స్, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు, రొటారక్టర్స్, విధ్యార్థులు హజరయ్యారు.

## కుక్కల దాడితో జింక మృతి



**కోట, మేజర్‌న్యూస్ :** కోట మండలంలోని లక్ష్మక్కకండ్రిగ గ్రామంలోని. శ్రీ కోటాలమ్మ తల్లి దేవస్థానం సమీప పొలాల్లో జింక మృతి. గ్రామస్తులు గమనించి అటవీ శాఖ సమాచారంఇచ్చారు.బీట్ ఆఫీసర్ బి. రవి సంఘటన స్థలానికి చేరుకొని. పరిశీలన చేశారు. కుక్కల దాడి చేయడంతో మృతి చెందినట్లు గుర్తించారు. ఆ జింకుకు అంత్యక్రియలు చేశారు.

## కోదండ రామాంజనేయునికి విశేష పూల అలంకరణ



**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్ :** గూడూరు పట్టణంలోని కోనేటి మీట్టలో వెలసి ఉన్న శ్రీ కోదండ రామాంజనేయ స్వామి దేవస్థానంలో మాస ఉత్సవాలో భాగంగా ఆంజనేయ స్వామి వారికి విశేష అలంకరణ ఏర్పాటు చేసి మంగళ వాయిద్యాలు భక్తుల గోవిందా శ్రీరామనామ స్మరణతో పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## వెండిచీరలో శ్రీ రాజరాజేశ్వరి దేవి



**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్ :** గూడూరు పట్టణంలోని సత్రపు వీధిలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో పదో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారు వెండి చీరలో భక్తులకు దర్శనమిచ్చారు గణపతి పూజ, దుర్గ త్రిశతి, హెూమం, పూర్ణాహుతి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

# ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ పై అవగాహన సదస్సు




**పలమనేరు, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా పలమనేర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో హెల్త్ ఉమెన్, హ్యాపీ ఉమెన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐసిడిఎస్, సిడిపిఓ ఇందిరా ప్రియదర్శిని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ముఖ్యఅతిథులకు హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ ఉమెన్, హ్యాపీ ఉమెన్ కార్యక్రమానికి అంగన్వాడీ కార్యకర్తలు, మినీ వర్కర్లు తయారుచేసుకొచ్చిన వివిధ రకాల పిండి వంటలను ఎగ్జిబిషన్ ద్వారా ప్రదర్శింపజేశారు. తయారుచేసిన వివిధ రకాల పిండి వంటలను కమిషనర్ రమణారెడ్డి పరిశీలించి ఐసీడీఎస్ అధికారులకు, అంగన్వాడి వర్కర్లకు, మినీ వర్కర్లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తయారుచేసిన పిండి వంటలు గురించి అంగన్వాడి కేంద్రానికి వచ్చే గర్భవతులకు బాలింతలకు, స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్లు నజ్మా, గీత, మాధవి లత, లత మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇప్పటికే అనేక మండలాల్లో, క్లస్టర్, సెక్టార్లలో అంగన్వాడి కేంద్రాల నందు ఇలాంటి ఎగ్జిబిషన్ ద్వారా గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించామన్నారు. అంగన్వాడి పిల్లలు, బాలికల ద్వారా చెట్లు నాటించడం, సైకిల్ ర్యాలీలు, బాల్య వివాహాలపై, బాల కార్మికులు నిర్మూలన, బాలికలు, మహిళల హక్కులపై అవగాహన కల్పించామని తెలిపారు. ఈ విధంగా మార్చి 1వ తేదీ నుండి ఎనిమిదో తేదీ వరకు ఐసిడి ఎస్, ఆధ్వర్యంలో రోజుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి బాబా, మేనేజర్ ఖాదర్ భాషా, మునిసిపల్ సిబ్బంది, అంగనవాడి వర్కర్ల, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

# ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు ఆహ్వానం



**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్ :** తిరుపతి అర్బన్ మండలంలోని 2019 సంవత్సరానికి ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివాసం ఉన్న ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి అర్బన్ మండలం తాహసిల్దార్ మీడియాకు తెలియజేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములైనటువంటి గ్రామ కంఠం, అనాధీనం, పోరంబోకు, గయాలు, పశువుల మేత బీడు వంటి స్థలాలలో ఇల్లు కట్టి నివాసం ఏర్పరుచుకున్న వారికి ఆ ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. దరఖాస్తు మహిళా పేరుతో దరఖాస్తు చేసుకుని, దరఖాస్తుతో పాటు నివాసం ఉన్న ఇల్లుకి సంబంధించిన కరెంటు బిల్లు గాని ఇంటి పన్ను గానీ, సంబంధిత పత్రాలు జత చేసి సంబంధిత సచివాలయంలో వీఆర్వో ని సంప్రదించాలన్నారు. దరఖాస్తు అనంతరం క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. 150 గజాల వరకు పేదలకు ఫ్రీ రిజిస్ట్రేషన్ ఉంటుందని, ఆపైన బేసిక్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కుంట పరంబోకి, చెరువులు, వాగులు, వంకలు ముంపు ప్రాంతాలలో ఆక్రమిత ఇల్లు ఏర్పరుచుకున్న వారికి క్రమబద్ధీకరణకు అవకాశం లేదన్నారు.

# జనసేన ఇంఛార్జి వినుతతో వికృతమాల టిడ్కో ఇళ్ళ వాసులు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కి చెందిన టిడ్కో ఇళ్లు ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీలో కేటాయించడం జరిగింది. వారికి ఎలాంటి సదుపాయాలు గత ప్రభుత్వంలో కల్పించలేదని చాలా వరకు ఇళ్లు కేటాయించలేదని దాదాపు1800 ఇళ్లు కట్టినా కూడా కనీస వసతులు లేవని టిడ్కో ఇళ్ళ వాసులు బుధవారం రేణిగుంట పార్టీ కార్యాలయం వద్ద జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి వినుత కోటాని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అక్కడ 7 బోర్లు ఉంటే కనీసం 2 కూడా పని చెయ్యడం లేదని, బస్ సౌకర్యం లేక స్కూల్ పిల్లలు 5 కిమీ నడిచి వెళ్తున్నారని, వారి ప్రాంతంలో రేషన్ ఇవ్వడం లేదని, కొంత మందికి పెన్షన్ లు ఇవ్వడం లేదని, డ్రైనేజ్ కాలువలు లేవని తెలిపారు. ఈ సమస్యలను తప్పక టిడ్కో చైర్మన్ వేముల పాటి అజయ్ కుమార్‌కి, తిరుపతి ఎమ్మెల్యేకి, తిరుపతి మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని వినుత ప్రజలకి హామీ ఇవ్వడం జరిగింది. త్వరలో తిరుపతి ఎమ్మెల్యేతో కలిసి టిడ్కో ఇళ్లను పరిశీలిస్తామని తెలిపారు.

# కుప్పంలోని వాల్ట్ స్పియర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఎంఓయు కుదుర్చుకున్న మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాల



**పలమనేరు, మేజర్‌న్యూస్ :** పట్టణ సమీపంలోని మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం వారు కుప్పంలోని వాల్ట్ స్పెయర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారితో ఎం ఓ యు కుదుర్చుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఎం. రవీంద్రబాబు తెలిపారు. ఈ ఎం ఓ యు వలన ఈ కళాశాలలోని ఇంజనీరింగ్ విద్యార్థులకు అదునాతన సాంకేతిక అంశంపై శిక్షణ పొందడానికి వివిధ అంశాల పైన ప్రాజెక్టులు మినీ ప్రాజెక్టులు చేయడానికి విద్యార్థులకు ఇంటర్న్షిప్ చేయడానికి అవకాశాలు మెండుగా ఉంటాయని ఎం. రవీంద్రబాబు తెలిపారు. ఈ అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని వారు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం. రవీంద్రబాబుతో పాటు డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.లక్ష్మీకాంత్ రెడ్డి, విభాగపు అధిపతి లోకేష్, కుప్పంలోనే కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వేదాల గొప్పతనాన్ని ఆవిష్కరించిన వేద పండితులు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం వేదసభ నిర్వహించారు. దేవస్థానం శ్రీ దక్షిణామూర్తి స్వామి సన్నిధి వద్ద ఉదయం నిర్వహించిన వేదసభలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేదపండితులు వేద పారాయణం చేశారు. వేదాల గొప్పతనాన్ని వేద సారాంశాన్ని వివరించారు. సామవేదం, శుక్ల యజుర్వేదాం, కృష్ణ యజుర్వేదం, అధర్వణ వేదం లోని సారాంశాలను వివరిస్తూ మానవ సంస్కృతి, సంప్రదాయాలను వేదపండితులు వేద పారాయణం చేశారు. వీరికి సాయంత్రం దూర్జటి కళా ప్రాంగణంలో ఆలయ ఈఓ బాపిరెడ్డి, అధికారులు సత్కారం చేశారు.

## శివయ్య సేవలో టయోట కంపెనీ డైరక్టర్



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** కిర్లోస్కర్ టయోటా కంపెనీ డైరెక్టర్ (కర్ణాటక) టి ఆర్ నాగరాజన్ దంపతులు బుధవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. వీరినీజనమాల గురవయ్య, గుండాల బాబు దుశ్శాలువాతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.

## శనేశ్వర స్వామి ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ట



**పలమనేరు, మేజర్‌న్యూస్ :** గంటవూరు వద్ద ఉన్నశ్రీ మృణాళిని సమేత అమృత మృత్యుంజయ శర్వ సోమ స్కంద మూర్తి అలాగే సతీ సమేత సూర్యనారాయణ స్వామి,అలాగే నవగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నూతన విగ్రహాలకు 36 రకాల సుగంధ ద్రవ్యాలతో పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ ప్రతిష్టా కార్యక్రమాలు స్థలదాత అయిన చైర్మన్ వంశ పారపర్య ధర్మకర్త రవీంద్ర శెట్టి, కుటుంబ సభ్యులఆధ్వర్యంలో రెండు రోజులు పాటు ఈ విగ్రహ ప్రతిష్టాకార్యక్రమమును నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయంమహాకుమాభిషేకాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రం రికార్డుల పరిశీలన



**పలమనేరు, మేజర్‌న్యూస్ :** విద్యా వనరుల కేంద్రం నందు బుధవారం భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ డాక్టర్ వి.విజయ ప్రకాష్ నాయుడు, ఎంఈఓ బాల సుందరం, భవిత కేంద్రంను పరిశీలించడం జరిగినది. పిల్లల యొక్క హాజరు రికార్డులను పరిశీలించి తగిన సూచనలు సలహాలను ఇవ్వడం జరిగినది. పిల్లలతో సంభాషించి వారి యొక్క అభివృద్ధిని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో టీచర్ మంగేశ్వరి, మురళి సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం డిగ్రీ కళాశాలలో 'స్వచ్ఛ కుప్పం' అవగాహన



కుప్పం, మేజర్ న్యూస్: కుప్పం డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ కుప్పం అవగాహన కార్యక్రమంలో భాగంగా కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ కుప్పం కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని, అలాగే ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణ గురించి ప్రజలలో అవగాహన కల్పించడానికి ఐ ఈ సి లో ఇంటర్న్‌షిఫ్ అవకాశాన్ని విద్యార్థులకు కల్పిస్తున్నామని తెలియజేశారు.ఈ అవకాశం ద్వారా విద్యార్థులు వ్యర్థరహిత పరిశుభ్రమైన నగరంగా కుప్పంను తీర్చిదిద్దడంలో పాలుపంచుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం ఐఈసి ఇంటర్నషిప్ అవకాశాన్ని తమ విద్యార్థులకు కల్పించిన కమిషనర్ శ్రీనివాసరావుకి కళాశాల ప్రిన్సిపాల్ డి సుధారాణికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ ఈ సి కోఆర్డినేటర్ లావణ్య అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ పట్టణంగా కుప్పం

### – రూపు రేఖలు మారనున్న మున్సిపాలిటీ – కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్



కుప్పం, మేజర్ న్యూస్: ఉత్తమ పట్టణముగా కుప్పం మునిసిపాలిటీ ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి పనులు చేపట్ట నున్నామని కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మరమ్మత్ తెలిపారు. కుప్పంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై బుధవారం ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడారు కుప్పం విజన్ డాక్యుమెంటరీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రారంభించామన్నారు. మోడల్ టౌన్ గా కుప్పంలో జూలైలోగా పూర్తి చేస్తామన్నారు. పలమనేరు క్రిష్ణగిరి జాతీయ రహదారి ఫోర్ లైన్ రోడ్ల విస్తరణ, నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా గృహ నిర్మాణం లాంటి నిర్మాణాత్మకమైన పనులు చేపట్టామన్నారు. మదర్ డైరీ కి స్థలం ఇచ్చామని, 8వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.ఈ సైకిల్ ద్వారా మహిళలు 400 మందికి సబ్సిడీ రూపంలో అందిస్తున్నామన్నారు. కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సిటీ స్కాన్ ఏర్పాటు చేస్తామని, హంద్రీనీవా సుజల స్రవంతి పనులు ప్రారంభించారని మరో ఐదు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలోని రోడ్ల పనుల కోసం రూ 53 కోట్లు మంజూరు అయిందని తెలిపారు.మార్చి 11న జాబ్ మేళా నిర్వహించ నిర్వహించనున్నా మన్నారు. వివిధ కంపెనీల ద్వారా 12 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, కుప్పం టూరిజం అభివృద్ధి, క్రీడా కాంప్లెక్స్, స్మశానం, కమాండ్ కంట్రోల్, 15 రోజుల్లో టెండర్లు మాస్టర్ ప్లాన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కుప్పంలో కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు కడ అధికారి వివరించారు.

## విద్యార్థులకు వైద్య, రక్తదాన శిబిరం ఏర్పాటు

కుప్పం, మేజర్ న్యూస్: రోసా మిస్టికా ఇండో జర్మన్ స్కూల్ నందు పిఈఎస్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం నాడు ఉచిత వైద్య శిబిరం మరియు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కస్పాండెంట్ రూబీ ఎగ్నెస్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి తమ పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థుల యొక్క ఆరోగ్య పరిస్థితులు ప్రతి మూడు నెలలకు ఒకసారి వారు ఏ విధంగా శారీరకంగా మానసికంగా అభివృద్ధి చెందారని తెలుసుకోవాలని ఉద్దేశంతో ఇలాంటి వైద్య శిబిరంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దానితోపాటు తమ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేయడం జరిగిందన్నారు. రక్తదానం చేయడం వలన ఎవరికి ఎటువంటి నష్టం ఉండదని రక్తదానం వలన మరొక ప్రాణాన్ని మనం నిలబెట్టిన వారం అవుతామన్నారు. ఇలాంటి సామాజిక స్పృహ పిల్లల్లో కూడా రావడానికి ఇలాంటి కార్యక్రమాల్లో ఎంతో తోడ్పడతాయని ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు కూడా భవిష్యత్తులో సమాజానికి తమ వంతు కూడా సేవ చేయాలని తపన వారిలో ఏర్పడుతుందన్నారు. తమ పాఠశాల నుండి పదిమంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు రక్తదానం చేయడం జరిగిందన్నారు. వారందరికీ కూడా నన్ను కృతజ్ఞతలు తెలుపుతూ వైద్య శిబిరానికి తమకు సహాయ సహకారాలు అందించినటువంటి పి ఈ ఎస్ ఆసుపత్రి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పి ఈ ఎస్ వైద్య కళాశాల మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.







# అనధికార కోతలు - అన్నదాతకు వాతలు

### – నియంత్రిక ఒకటి పెట్టారు–మరొకటి మరిచారు – మోటార్ల వద్ద–కాపు కాస్తున్న అన్నదాతలు

### – గంటకోసారి–విద్యుత్ కోత– వేసవి ప్రారంభంలోనే మొదలైన–కోతలు

### – పంటలపై–తీవ్ర ప్రభావం– విద్యుత్ అధికారులపై–రైతుల కన్నెర్ర – పట్టించుకోని–ప్రభుత్వం

వి.కోట, మేజర్ న్యూస్: కొత్త సబ్స్టేషన్ ప్రారంభించారు...విద్యుత్ సరఫరా చేశారు...వోల్టేజ్ సమస్యకు చరమగీతం అన్నారు... అన్నదాతల్లో ఆశలు చిగురించాయి...విద్యుత్ సమస్య ఉండదనుకున్నారు...వేసవి సమీపిస్తుంది....సమస్య మొదటికొచ్చింది...రెండు నియంత్రికలు ఉండాల్సింది...ఒకటే పెట్టారు... ఇంకొకటి మరిచారు....అధిక ఒత్తిడికి గురవుతోంది....అనధికార కోతలు విధిస్తున్నారు...గంటకోసారి విద్యుత్ నిలిపేస్తున్నారు....పంటలు ఎండుతున్నాయి....రైతులు నష్టపోతున్నారు...ఉన్నతాధికారులు కన్నెత్తి చూడలేదు....పాలకులు పట్టించుకోలేదు....గత సమస్య పునరావృతమవుతోంది. వి.కోట,బైరెడ్డిపల్లి మండలాలకు శాశ్వతంగా లో–వోల్టేజ్ సమస్యకు చరమగీతం పాడాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం తోటకనుమ గ్రామం వద్ద 132/33 కెవి సబ్స్టేషన్ను నిర్మించింది.ప్రస్తుత పాలకులు ప్రారంభించారు.ఆ సందర్భంగా. .132/33 కెవి సబ్ స్టేషన్ మంజూరు చేసింది మేమే... ప్రారంభించింది మేమే అంటూ పాలకులు ఆడంబరంగా ప్రారంభించారు.సరఫరా మొదలయ్యింది.అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యకు అడ్డుకట్టపడిందని సంబరపడ్డారు.మూడు నెలలు విద్యుత్ సరఫరా కొనసాగింది.నాణ్యమైన విద్యుత్ అందింది.ఫిబ్రవరి నెలలో అనధికారిక కోతలు మొదలయ్యాయి.వివరాల్లోకి వెళితే వి.కోట మండలం తోటకనుమ గ్రామం వద్ద 132/33 కెవి సబ్ స్టేషన్ నుండి వి.కోట,బైరెడ్డిపల్లి మండలాలకు విద్యుత్ సరఫరా జరుగుతోంది.సబ్ స్టేషన్లో 31.5 మెగావాట్స్ విద్యుత్ నియంత్రిక ఏర్పాటు చేశారు.సుమారు 24 మెగావాట్ల విద్యుత్ లోడ్ వినియోగించుకోవచ్చు.దీని నుండి వి.కోట మండల పరిధిలోని 7 సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరా ఇవ్వాలి.అయితే కస్తూరి నగరం,వి.కోట,పాపేపల్లి మిట్ట, యాలకల్లు,పాముగానిపల్లి తదితర 33/11కెవి సబ్స్టేషన్లకు విద్యుత్ సరఫరా వెళ్తోంది.బైరెడ్డిపల్లి మండల పరిధిలోని 6 సబ్ స్టేషన్ లకు విద్యుత్ అందాలి. అయితే బైరెడ్డిపల్లి,తీర్థం,కడపనత్తం తదితర మూడు సబ్ స్టేషన్ లకు సరఫరా ఇచ్చారు.దీంతో నియంత్రిక పై అధిక ఒత్తిడి పడుతోంది.7 గంటలు రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా అందించాలి.పగటిపూట నాలుగు గంటలు.రాత్రుల్లో మూడు గంటలు నిర్విరామంగా అందించాలి. అయితే నూతన సబ్ స్టేషన్ ప్రారంభంలో రెండు నెలలపాటు నాణ్యమైన విద్యుత్ రైతులకు అందింది.కోతలు లేకుండా సరఫరా జరిగింది.ప్రస్తుతం ఫిబ్రవరి నుండి అనధికార కోతలు మొదలయ్యాయి.ఒకే నియంత్రిక ఉండడంతో అధిక లోడ్డు పడడంతో బ్రేకర్ పడిపోతోంది.దీంతో విద్యుత్ సిబ్బంది కోతలకు సిద్ధమయ్యారు.రెండు ఫీడర్లకు సరఫరా జరుగుతున్నప్పుడు..ఒక ఫీడర్కు గంట సమయం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు.అనంతరం మరో ఫీడర్ కు విద్యుత్ పునరుద్ధరిస్తున్నారు.దీంతో కోతలు మొదలయ్యాయి.పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.ప్రభుత్వం నిర్దేశించిన ఏడు గంటల విద్యుత్ రైతులకు అందడం లేదు.పంటలు ఎండుముఖం పడుతున్నాయి.విద్యుత్ సబ్స్టేషన్లకు రైతులు ఫోన్ చేసి నిలదీసిన సమాధానం దొరకడం లేదు.మెయిన్ లైన్ నిలుపుదల చేశారన్న సమాధానం దొరుకుతోందని రైతులకు చెబుతున్నారు.అనధికార కోతలతో కర్షకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.వేసవి ప్రారంభంలోనే కోతలు మొదలుపెట్టారు.ఇక మార్చి,ఏప్రిల్,మే నెలల్లో పంటలు పరిస్థితి ఏమంటు రైతులు ఆందోళన చెందుతున్నారు.ప్రధానంగా 132/33కెవి సబ్ స్టేషన్ లో 31.5 మెగావాట్ కలిగిన రెండు నియంత్రికలు 132/33 కెవి సబ్ స్టేషన్ లో ఏర్పాటు చేయాలి. ఎందుకనుగుణంగా 2 ప్లాట్ఫారంలు తయారు చేశారు.అయితే ఒక నియంత్రిక మాత్రమే ఏర్పాటు చేశారు.దీంతో అసలు సమస్య మొదలయ్యింది.విద్యుత్ ఉన్నత అధికారులు సైతం సబ్ స్టేషన్ పై దృష్టి పెట్టడం లేదు.పాలకులు పట్టించుకోలేదు.వేసవిలో పంటల రక్షణ ప్రశ్నార్థకంగా మిగులుతోంది.మంజూరు చేసాం.. ప్రారంభిస్తున్నామన్న పాలకుల మాటలు ఎటుపోయాయంటూ రైతులు నిలదీస్తున్నారు.మరోపక్క తోటకనుమ సబ్ స్టేషన్ నుండి బైరెడ్డిపల్లి,వి.కోట మండల పరిధిలోని సబ్ స్టేషన్ లకు ప్రత్యేకంగా 14 కిలోమీటర్ల లెక్కన 28 కిలోమీటర్ల కొత్త విద్యుత్ లైన్లు లాగాల్సి ఉంది.దానిపై దృష్టి పెట్టడం లేదు.దీంతో లో–వోల్టేజ్ సమస్య ప్రారంభమయ్యింది.నాణ్యమైన విద్యుత్ అందుతుందన్న రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి.పూర్తిస్థాయి నియంత్రికలు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో పాలకులు తీవ్రంగా వైఫల్యం చెందారని రైతులు మండిపడుతున్నారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉన్నతాధికారుల సైతం పట్టించుకోవడం లేదు.ఎండలు మండుతున్నాయి.ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో పెరుగుతున్నాయి.వేసవి లో విద్యుత్ సమస్య గణనీయంగా ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి వుంది.దీన్ని దృష్టిలో పెట్టుకొని ఏపీ ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు తక్షణమే విద్యుత్ నియంత్రిక ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.అయితే పై అధికారులకు నివేదిక పంపమంటూ కాలయాపన చేస్తున్నారు.ఇకనైనా పాలకులు స్పందించి తోటకనుమ సబ్ స్టేషన్లో మరో 31.5 మెగావాట్ విద్యుత్ నియంత్రిక ఏర్పాటు చేసి వి.కోట,బైరెడ్డిపల్లి మండలాల రైతులకు లో–వోల్టే సమస్య, అనధికార కోతలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే...సంక్షేమ, అభివృద్ధి సాధ్యం

### – చిత్తూరు టీడీపీ నాయకులు



చిత్తూరు అర్బన్, మేజర్న్యూస్: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు సాధ్యమని టీడీపీ చిత్తూరు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం చిత్తూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం ప్రజలకు రూ.4వేలు పెన్షన్, మహిళలకు ఉచితంగా సిలిండర్లు పంపిణీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం, చెత్తపై పన్నును రద్దు చేయడం, ఇసుక ఉచితంగా ఇవ్వడం మరియు గ్రామీణ ప్రాంతాల్లో సిసి రోడ్లు, డ్రైనేజ్, గోకులం షెడ్లు నిర్మాణం, గ్రామీణ ప్రాంతంలోని గుంతలు పడ్డ రోడ్లను తారు రోడ్లు వేయడం జరిగిందన్నారు. అలాగే ఎస్సీ , ఎస్టీ, బిసి, ఓసి, కాపు కులాల వారికి కూడా ప్రభుత్వ సబ్సిడీ రుణాలు అందిచడం జరుగుతున్నదన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో ఎలాంటి సబ్సిడీ రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఈ విలేకరుల సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా క్రిష్టియన్ సెల్ అధ్యక్షులు మేషాక్, చిత్తూరు పార్లమెంట్ వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి గోపాల్‌లు పేర్కొన్నారు.



## ఘనంగా మహిళా సాధికారత వారోత్సవాలు

చిత్తూరు క్రైమ్, మేజర్ న్యూస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు నేతృత్వంలో జిల్లా అంతటా "మహిళా సాధికారత వారోత్సవాలు" ఘనంగా నిర్వహిస్తున్నారు.బుధవారం చిత్తూరు జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాఠశాలలో "జెండర్ ఈక్వలిటీ " పై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని, తమ సృజనాత్మకతతో సమానత్వాన్ని ప్రతిబింబించే చిత్రాలను వర్ణించారు. మహిళలు, పురుషులు సమానత్వంపై విద్యార్థుల అవగాహన పెంచేలా ఈ పోటీలు ఉపయుక్తంగా నిలిచాయి. పోటీలో విజేతలకు బహుమతులు అందజేసారు సమానత్వ సందేశాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేసేందుకు చిత్తూరు జిల్లా పోలీసులు ప్రోత్సహించారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో మహిళల భద్రత అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా మారింది. ప్రధానంగా సోషల్ మీడియా వినియోగం పెరగడం, ప్రజాస్థలాల్లో ఎదురయ్యే సమస్యలు మహిళల భద్రతపై ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో, పెయింటింగ్ పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు ఈ సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తీకరించవచ్చు. రంగుల ద్వారా సందేశాన్ని ప్రచారం చేయడం ప్రజల్లో మరింత అవగాహన కల్పించడానికి సహాయపడుతుందని, ఈ నెల 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ తరహా కార్యక్రమాలు మహిళలకు శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయరక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు.

## పశువులకు గాలికుంటు టీకాలు



కార్వేటినగరం, మేజర్ న్యూస్: జాతీయ పశు వ్యాధి నివారణ పథకం కింద పాడి పశువులకు వేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంలోని పశు వైద్యాధికారి హేమ కుమార్ ఆధ్వర్యంలో గాలికుంటి వ్యాధి టీకాలు పశువులకు వేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ టీకా వేయించడం వలన పశువులకు ఎలాంటి సమస్యలు రావని స్పష్టంచేశారు. పశువులకు, గేదెలకు వేయించాలన్నారు. ఈకార్యక్రమంలో సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

### – జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీమారావు

చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్: ఈ నెల 8 న జరగనున్నా జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఇ. బీమారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 8 న శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని, రాజి మార్గం లో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయము, ధనము అదా అవుతుందని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని దాని పై ఆపిల్ ఉండదన్నారు. లోక్ అదాలత్ లో అన్ని రకాల రాజి పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు,మోటార్ వాహనాల కేసులు,చెక్ బౌన్స్ కేసులు ఈపి, డివిసి, ఎంసీ , బ్యాంక్ కేసులు, బిఎస్ఎన్ఎల్, బిపిఎల్ , మొదలగు కేసులను రాజి చేసుకోవచ్చు అన్నారు. కక్షదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవలన్నారు.ఈ నెల 8 న నిర్వహించే లోక్ అదాలత్‌లో న్యాయ మూర్తులు,న్యాయ వాదులు,రెవిన్యూ, పోలీసు, బ్యాంకు అధికారులు ,చిట్ ఫండ్ కంపిణిలు,భీమ సంస్థ ప్రతినిధులు, కక్షదారులు పాల్గొని విజయవంతంగా నిర్వహించి జిల్లాలో ఎక్కువ కేసులు పరిష్కరించి చిత్తూరు జిల్లాను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో ఉండేలా సహకరించాలని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

## 494 మద్యం బాటిళ్లు స్వాధీనం

నగరి, మేజర్ న్యూస్: నగరి సిఐ మరియు పోలీస్ సిబ్బందితో కలిసి నగరిలో ఒక ఎర ఆపరేషన్ నిర్వహించారు 452 డి పీ ఎల్ బాటిళ్లు – 180మిల్లి మరియు 42 బీరు బాటిళు ఉన్న బెల్ట్ షాపును కనుగొన్నారు మొత్తం 494 బాటిళ్లను స్వాధీనం పరుచు కున్నారు, దాని మొత్తం విలువ 72,793/-, రూపాయలు ఇద్దరు ముద్దాయి లను అదుపు లోకి తీసుకొని వారిని రిమాండ్ కు పంపించడం జరిగింది.



# ఆ సీసీ రూటే సపరేట్...ఎమ్మెల్యే గారు న్యాయం చేయండి





తొట్టంబేడు, మేజర్ న్యూస్: తొట్టంబేడు మండలం వెలుగు కార్యాలయంలో రాజకీయ జోక్యం ఎక్కువయింది డ్వాక్రా సంఘాలు మహిళలకు పసుపు రంగు ఉంటేనే లోన్లు కూడా వస్తాయి. ఆ శాఖ అధికారులు అధికార పార్టీ నాయకులకు వస్తాస్తు పలుకుతూ వాళ్ల అడుగులకు మడుగులు వేస్తూ. నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తూ. వ్యవహరిస్తున్నారు. పూడి గ్రామం శాషమ నాయుడు. శంకర్ నాయుడులు తెలుగుదేశం పార్టీ చెప్పి తెలుగుదేశం పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారు. నిరుపేద మహిళలకు అన్యాయం చేస్తున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి స్పందించి నాకు న్యాయం చేయాలని మహిళ సంఘాలు కోరుతున్నాయి. అధికార పార్టీ నాయకులకు అండగా ఓ సిసి కోమ్ము కాస్తున్నాడు. అతను ఓనాయుడు వర్గానికి చెందిన వ్యక్తి అయితే ఆ నాయుడు వర్గానికి చెందినవారు ఏమి చెబితే అదే చేస్తున్నాడు. కులం అధికారిని అడ్డుపెట్టుకొని. అతను సీసీ కాదు ఓ ఏపిఎంలా వ్యవహరిస్తూ. మండలాన్ని శాసిస్తున్నాడు. కులానికి ప్రాధాన్యత ఇస్తూ. మండలంలో రాజకీయ చిచ్చు పెడుతున్నాడు. తొట్టంబేడు మండలంలో నాయుడు వర్గానికి చెందిన ఓసిసి అధికార పెత్తనం. వివరాల్లో కెళితే తొట్టంబేడు మండలంలో పూడి గ్రామంలో గంగోత్రి మహిళా స్వయం సహాయక సంఘం ఈ సంఘంలో జి.చెంగమ్మ గత 25 సంవత్సరాలుగా ఆ గ్రూపులో సంఘ సభ్యురాలుగా ఉంది. అయితే ఆమెకు 60 సంవత్సరాలు నిన్నడంతో ఆమెకి బ్యాంకర్లు లోన్లు ఇవ్వనున్నారు. ఆమె ప్లేస్ లో ఆమె మనవరాలైన నాగరత్నమ్మకు అవకాశం ఇవ్వమని ఆ వృద్ధురాలు అడిగింది. అయితే ఆమెకు అవకాశం ఇవ్వకుండా. ఆ గ్రూపుకు సంబంధించిన లీడర్ పార్టీలకు అనుకూలంగా గ్రూపు నెంబర్లు కూడా చేర్చుకోవాలని వైసిపి అనే వారి మీద ముద్ర వేసి నాగ రత్నమ్మకు డ్వాక్రా రుణం ఇవ్వకుండా వైసిపి కార్యకర్తనే నెపంతోనే ప్రస్తుతం వాళ్లకి లోన్లు కూడా ఆపారు. అప్పు సబ్బు చేసి వారు తీసుకున్న బ్యాంకు రుణాన్ని చెల్లించిన కూడా వారి మీద వైసిపి ముద్ర వేసి లోన్లు ఇవ్వకుండా చేశారు. ఆమెకు ఇవ్వకపోయినా ఆమె అవ్వ అయినా చంగమ్మ కు కూడా లోన్ ఇవ్వకుండా ఆ సిసి 11 మందిలో పదిమందికే లోన్లు ఇవ్వడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. పార్టీలకు కొమ్ము కోస్తూ డ్వాక్రా మహిళలు విషయంలో కూడా.. పార్టీలను చూడడం.. ఇదే మొదటిసారి అని. పూడి గ్రామస్తులు. గుసగుసలాడుతున్నారు. ఏది ఏమైనా ఇలాంటి అధికారులు వల్ల. కుల వ్యవస్థలతో పాటు. పార్టీలకు. నష్టం వాటిల్లి అవకాశం ఎంతైనా ఉందని. ఇలాంటి అధికారులను.. వెన్నుంట పెట్టుకుంటే రానున్న రోజుల్లో పార్టీలకు నష్టం వాటిలే అవకాశం ఎంతైనా ఉంది. స్థానిక ఎమ్మెల్యే. ఉన్నత అధికారులు స్పందించి ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని పూడి గ్రామస్తులు కోరుతున్నారు.

## తిరుమల నడక మార్గంలో 100 అడుగుల లోయలో గుర్తు తెలియని భక్తుడు.!



తిరుమల, మేజర్ న్యూస్: తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనం కోసం అలిపిరి నుండి తిరుమలకు వెళ్లే నడక మార్గంలో ఆకాగర్ల ఆలయం ఎదురుగా ఉన్న 100 అడుగుల లోయ అయిన అవ్వాచారి కోనా లోయలో ఓ భక్తుడు అకస్మాత్తుగా దూకారు. దీన్ని చూసిన సహ భక్తులు వెంటనే దేవస్థానం అధికారులకు సమాచారం అందించారు.దీనితో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని దేవస్థానం విజిలెన్స్, అటవీ శాఖ, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు 40 మంది సభ్యుల బృందం కట్టెలతో సహాయపడుతూ లోయలో దిగి గాలిస్తున్నారు.

## ఘనంగా రామ్మోహన్ రావు 20వ వర్ధంతి

సూళ్లూరుపేట రూరల్, మేజర్ న్యూస్: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణంలో ఉన్న ఆర్.టి.సి. డిపో ఆవరణంలో బుదవారం డిపో ప్రసిడెంట్ దక్కిలి పోలయ్య ఆధ్వర్యంలో యూనియన్ వ్యవస్థాపకులు రామ్మోహన్ రావు 20 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్య గ్రామానికి ముఖ్య అధిలుగా జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ యం. శేఖర్ పాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రామ్మోహన్ రావు యూనియన్కి చేసిన సేవలు అదే విధంగా ఆర్.టి.సి. ఉద్యోగుల కొరకు ప్రత్యేకంగా ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో యానియన్ సెక్టరీ ఎ.యస్. సుబ్రమణ్యం, చైర్మెన్ యం. భాస్కర్, కాలే షా, రామచంద్రయ్య, సుబ్బయ్య, మాధవ్, సునీల్ కుమార్, వేములు, ఉద్యోగసు ఉద్యోగస్తులు, తదితరులు పాలన్నారు.



## మామిడి పంటలపై ఒంటరి ఏనుగు దాడి



బంగారుపాలెం, మేజర్ న్యూస్: బంగారుపాళ్యం మండల కేంద్రం లోని కె.ఎం.కండిగ పంచాయతీ లక్ష్మీపురం గ్రామ సమీపంలో పొలం దగ్గర కాపురం ఉంటున్న మాణిక్యం కు చెందిన ఆవును ఏనుగు దాడి చేసి గాయపరచడం జరిగింది. అలాగే జ్యోతినాయుడుకు చెందిన టెంకాయి,మామిడి చెట్లను ధ్వంసం చేశాయి.ఇలా తరచూ అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న గ్రామాలలో పంటలు, మోటార్లు, బోర్లు, మనుషులు, పశువులపై దాడి చేస్తూ నష్టం కలిగిగిస్తూ ఉండడం గమనార్హం ఇకనైనా అధికారులు ఏనుగుల దాడి నుండి రక్షించాలని అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.అలాగే పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని అధికారులను కోరుతున్నారు.

## ముగిసిన కార్పొరేషన్ రాయితీ రుణాల ఇంటర్వ్యూలు

చిత్తూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్: చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో బీసీ, ఓబీసీ, కాపు కార్పొరేషన్ రాయితీ రుణాల మంజూరు కోసం నగరపాలక కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం 26- 50 వార్డుల పరిధిలోని లబ్ధిదారులకు బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్ లైన్లో చేసిన దరఖాస్తుల ప్రకారం ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఇంటర్వ్యూ చేశారు. నగరపాలక పరిధిలోని 38 బ్యాంకు బ్రాంచీల అధికారులు ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. మంగళవారం, బుధవారం రెండు రోజులపాటు నిర్వహించిన ఇంటర్వ్యూలో మొత్తం 1,448 మంది దరఖాస్తుదారులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూల కోసం చేపట్టిన ఏర్పాట్లు, నిర్వహణను కమిషనర్ పి నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ పర్యవేక్షించారు.



# రైతు సంక్షేమానికి బాసటగా కూటమి ప్రభుత్వం

## – 90 శాతం సబ్సిడీతో రైతులకు డ్రిప్ పరికరాలు

## – టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు



శాంతిపురం, మేజర్ న్యూస్: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మాజీ శాసన మండలి సభ్యులు మాజీ టీటీడీ బోర్డు మెంబర్ గౌని వారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందివ్వడం జరుగుతున్నదని అన్నారు. రైతు తన వాటా కింద పది శాతం నిధులు చెల్లిస్తే చాలని అన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం 343.76 కోట్ల సబ్సిడీని రైతులకు ఇచ్చిందన్నారు. బీసీల కోసం కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. 2025- 26 సంవత్సరానికి గాను బీసీ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం 47 456 కోట్లు కేటాయించిందని హర్షం వ్యక్తం చేశారు. 1000 కోట్లతో వెనుకబడిన తరగతుల వారి కోసం ఆదరణ పథకాన్ని పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. మత్సకారుల కు వేట నిషేధ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని 20 వేలకు పెంచడం జరిగిందన్నారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగాను, చేనేత మర మగ్గాలకు 500 యూనిట్లు విద్యుత్ ఉచితంగాను ,చేనేత కార్మికులకు జీఎస్టీ ఎత్తివేత, చేనేత కార్మికులు ఇంటి నిర్మాణానికి అదనంగా 50వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నాయి బ్రాహ్మణ జీతాలు 15వేల నుంచి 20వేల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు సెలూన్ షాపులు నిర్వహించే నాయి బ్రాహ్మణులకు200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలలో రిజర్వేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. అంతేకాకుండా ప్రత్యేక బీసీ రక్షణ చట్టం, బీసీ స్టడీ సర్కిల్స్ పునరుద్ధరణ, పదవులలో రిజర్వేషన్ వంటివి ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.

# రాబరీ దొంగలు అరెస్టు





నగరి, మేజర్ న్యూస్: గత శివరాత్రి రోజు రాత్రి నగరి పట్టణంలోని అన్నా క్యాంటీన్లో వాచ్మెన్ ని కొట్టి అతని వద్ద నుంచి 700 రూపాయలు మరియు మొబైల్ ఫోను రాబరీ చేసినటువంటి నగరి పట్టణం ఇంద్రానగర్‌కు చెందిన హబీబ్ 22 సంవత్సరాలు మరియు రాజేష్ 25 సంవత్సరాలు అనువారిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపడమైనది.

# నందీశ్వర ఆటో స్టాండ్ ప్రారంభం

## – రెండవ పట్టణ సిఐ వెంకటేశ్వర్లు



శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:శ్రీకాళహస్తి పట్టణం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ నంది సర్కిల్లో నందీశ్వర ఆటో స్టాండ్‌ను రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే పడిన తర్వాత టౌన్‌లోకి యాత్రికులు రావాలంటే కష్టంగా ఉండడంవల్ల ఈ ఆటో స్టాండ్ ప్రారంభించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించే విధంగా దేవస్థానానికి వచ్చేటటువంటి యాత్రికులకు అనుకూలమైనటువంటి చార్జీలను తీసుకోవాలన్నారు డ్రైవింగ్ లైసెన్సులు ప్రతి ఒక్క డ్రైవర్ కి ఉండాలనీ సూచించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమనేదని ఏర్పాటు చేయాలని, సబ్సిడీలలో బ్యాంకు రుణాలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివ సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు వైయస్ మనీ, మురళి వీది విక్రయదారుల జిల్లా అధ్యక్షుడు జనార్ధన్, లాజర్ భాష, నందీశ్వర ఆటో యూనియన్ నాయకులు పాండు, గణేష్ మనోహర్, పుట్టయ్య, చిరు, జ్ఞానయ్య, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పేదలపై విద్యుత్ చౌర్యం కేసులు...

## – జరిమానా కట్టకుంటే..– కోర్టు కీడుస్తామంటూ రైతులకు బెదిరింపులు



శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం పేదల పట్ల సవతి ప్రేమను చూపుతోంది. ఒక వైపు సంక్షేమ పథకాలు ఇస్తున్నామంటూనే.. మరో వైపు పేదల నుంచి అందినకాడికి గుంజేసే ప్రయత్నం చేస్తోంది. తాము అధికారంలోకి వస్తే తెల్ల రేషన్ కార్డు కల్గిన ప్రతి నిరుపేద ఇంటికి 250 విద్యుత్ యూనిట్లు ఉచితమంటూ హామీలు గుప్పించింది. తీరా అధికారంలోకి వచ్చాక ఉచితం మాట అటుంచి మీటర్లు లేని పేదల ఇళ్లపై విజిలెన్స్ దాడులు చేయించి, విద్యుత్ చౌర్యం పేరిట అక్రమ కేసులు బనాయిస్తోంది. అంతేనా విజిలెన్స్ విభాగం పోలీసులను గిరిజన కాలనీలు, దళితవాడలకు పంపి జరిమానా కడతారా..!! లేకుంటే కోర్టు బోనులో నిలబడతారా..? అంటూ బెదిరింపులు దిగుతోంది. ఈ తరహా బెదిరింపుల నేపథ్యంలో తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి దళితవాడ ప్రజలు విద్యుత్ విజిలెన్స్ విభాగం పోలీసులతో బుధవారం వాగ్వాదానికి దిగారు. నోటీసులు ఇవ్వకుండా కేసులు ఎలా పెడతారనీ, జరిమానా ఎలా విధిస్తారనీ, మరి ఇన్నాళ్ళూ నిద్రపోయారా...? అంటూ నిలదీయడం గమనార్హం.

### – ఇదంతా అదానీ కోసమేనా..

గిరిజన, దళిత వాడల్లో సాధారణంగా ఎక్కువ సంఖ్యలో గృహాలకు విద్యుత్ మీటర్లు ఉండవు. ఎందుకంటే మనం పేదలం.. మనకు విద్యుత్ ఉచితం.. ఇచ్చిన యూనిట్లు దాటి విద్యుత్ ఖర్చు మనకెందుకుంటదన్నది వారి నమ్మకం. అదే నమ్మకంతోటే ఇన్నేళ్లుగా పేదలంతా ఉచిత విద్యుత్ ను వాడుకుంటూ వస్తున్నారు. అయితే రెండు నెలలుగా పేదల గృహాలపై విద్యుత్ శాఖా విజిలెన్స్ దాడులు మొదలయ్యాయి. మొక్కుబడిగా వెళ్ళామా..!! ఎవరు మీటర్లు పెట్టుకున్నారు..? ఎవరు పెట్టుకోలేదు..? అన్న సమాచారం తెలుసుకున్నమా..!! యజమానికి తెలియకుండానే కేసులు పెట్టామా..!! అవి కట్టాలంటూ పోలీసులను పంపామా...!! అన్న రీతిలో విజిలెన్స్ అధికారులు తీరు మారింది. ఫిబ్రవరి 14న అంటే ప్రేమికుల దినోత్సవం నాడు విద్యుత్ శాఖా విజిలెన్స్ అధికారులు నియోజకవర్గం వ్యాప్తంగా పేదల గృహాలపై దాడులు చేశారు. ప్రేమగా కేసులు పెట్టారు. నేడు జరిమానా కట్టాలంటూ పోలీసులను పంపి బెదిరిస్తున్న పరిస్థితి. అయితే విద్యుత్ శాఖ ఇదంతా అదానీ కోసమే చేస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. పేదలను సైతం వదలకుండా బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించి ఉచిత విద్యుత్ పథకానికి ఉరి వేయాలని చూస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే అదానీ స్మార్ట్ కరెంట్ బాదుడుకు పునాదులు పడగా, దాన్ని కూటమి ప్రభుత్వం వడివడిగా ఆచరణలో పెడుతుండటం గమనార్హం. ఇప్పటికే స్థిరాదాయం లేక, కుటుంబం నావను లాగలేక సతమతమవుతున్న పేదల పట్ల విద్యుత్ శాఖధికారులు వ్యవహరిస్తున్న తీరు 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా' మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# జనసేన ఆవిర్భావ దినోత్సవసభ పోస్టర్‌ను ఆవిష్కరించిన మనోహర్..





చంద్రగిరి,మేజర్ న్యూస్: చంద్రగిరిజనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారంనిర్వహించిన జనసేన పార్టీసమావేశంలో చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ దేవర మనోహర్ఆధ్వర్యంలోరాష్ట్ర కార్యదర్శి సుభాషిని,మండల పార్టీ అధ్యక్షులు, ఇన్చార్జులుసమక్షంలో ఈనెల 14న పిఠాపురంలో జరిగే జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ సభవాల్ పోస్టర్ ను దేవర మనోహర్ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జ్ దేవర మనోహర్ మాట్లాడుతూజనసేన పార్టీఅధినేత పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు చంద్రగిరి నియోజకవర్గనలుమూలల నుండి గ్రామీణ స్థాయికార్యకర్తలతో పిఠాపురంలో జరిగే అవిర్బవ దినోత్సమునకు తరలి రావలని తెలిపారు. 2019 నుండి 2025 వరుకు ప్రజా సమస్యల పైఅనేక పోరాటాలు చేసామని,ఆ పోరాటం ఫలితంతోఎన్డీఏ కూటమి అధికారాన్నిచేపట్టిందన్నారు. నాకు ఎమ్మెల్యే టికెట్ వస్తే ఎలాంటి కసితో పని చేస్తానోఅంతేకసిగా కూటమి విజయానికి పనిచేశానన్నారు. 6మండల పార్టీల అధ్యక్షులు చంద్రగిరి కేంద్రపార్టీ కార్యాల యంలోఅందుబాటులోఉంటారని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసారని,జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు,కార్యకర్తల కష్టాలకు అండగా ఉంటానని అన్నారు. పిఠాపురం వచ్చేవారికి రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని,పదేండ్లకష్టానికి ఫలితం ప్రతిబింబించేలా, పండగావాతావరణంలో జనసేనఆవిర్భావసభకు జనసైనికులు,పవన్ కళ్యాణ్ అభిమానులు,కార్యకర్తలు, నాయకులు,భారీగాతరలివచ్చికార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షులు, ఇన్చార్జీలు కిషోర్ ,వెంకట్, యువరాజ్, నాని, యువకిశోర్, రూపేష్, కిరణ్ ,రాకేష్ ,వీర మహిళలు విజయనిర్మల,మంజుల వాణి,మండల నాయకులు జనసైనికులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు అవసరమయ్యే మెడిసిన్ అందుబాటులోకి తేవాలి

## – శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రులు. పీహెచ్సీలులకు వచ్చే పేద ప్రజలకు అవసరమయ్యే మెడిసిన్స్ సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసన సభలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుదీర్ రెడ్డి మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైయస్సార్ పరిపాలనలో పేద ప్రజలకు అవసరమయ్యే మెడిసిన్స్ ప్రభుత్వాసుపత్రిలో లేవని. అదే పరిస్థితి ప్రస్తుతం కొనసాగుతున్నదని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు నుండి వారికి నిత్యం కావాల్సిన మెడిసిన్స్ టాబ్లెట్స్. సెలెయన్స్. కుక్క కాటు. పాము కాటుకు వాడే మందులు. టైఫాయిడ్. మలేరియా. జాండీస్. వ్యాధులకు వాడే యాంటీ బయోటెక్ మందులు అవసరంగా ఉన్నాయని తెలిపారు. ఆ మందులు సకాలంలో ప్రభుత్వం ద్వారా అందించగలిగితే శ్రీకాళహస్తి నియోజవర్గం పేద ప్రజలకు ఉపయోగం ఉంటుందని తెలిపారు. ఫీవర్ వస్తే పరీక్ష చేసే యంత్రాలు లేవని. బీపీ షుగర్ చెకప్ చేసే యంత్రాలు లేవని తెలిపారు. పై మందులు ప్రభుత్వాసుపత్రిలో లేనందు వలన పేద ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు పోవాల్సి వస్తున్నదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ పేద ప్రజలకు అవసరమైన సెలైన్. యాంటీబయోటెక్. టైఫాయిడ్. మలేరియా. జాండీస్. కుక్క కాటు పా వ ు ు కా ట ు క ు ఉపయోగపడే మందులు నిత్యం సరఫరా చేయాలని శ్రీకాళహస్యం ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడడం జరిగింది.

**నోటీసు**

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా వెదురుకుప్పం మండలం, బొమ్మయ్యపల్లి గ్రామపంచాయతీ, దేవలంపేట గ్రామంలో కోదండ రామస్వామి దేవాలయం కలదు ఈ దేవాలయాన్ని దేవాదాయ శాఖ నందు సెక్షన్ 43 కింద రిజిస్టర్ చేయదలచినాము ఇందుకు సంబంధించి ఏదైనా అభ్యంతరాలు ఉన్న యెడల సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ, చిత్తూరు వారి కార్యాలయం నందు 15 రోజులలోపు అభ్యంతరాలు తెలియజేయగలరు

**ఇట్లు : ఆలయ కమిటీ**
**కోదండ రామస్వామి దేవాలయం**
**దేవలంపేట**

**CHANGE OF NAME**

I, **AASHISH KOCHAR ASHOK**, (Old Name) resident of 3-2-147, Flat No 302, Dhruva Apt, Raghavaiahpet, Near Shar Bus Stand, Sullurpeta, Tirupati, PIN 524 121, Andhra Pradesh, hereby declare that I have changed my name as **AASHISH KOCHAR** (New Name)/

# తిరుపతి గంగమ్మ నీ సేవకుడెవరమ్మా..!

**కుప్పం, మేజర్ న్యూస్:** 2019 – 24 మధ్యకాలంలో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కొనసాగిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులే నామినేటెడ్ పదవులలో కొనసాగడం రాజకీయ సాంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ ఆనవాయితీ ప్రకారం గత ప్రభుత్వ హయాములో వైసిపి నాయకులే నామినేటెడ్ పదవులలో కొనసాగారు. అయితే 2024లో రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలలో భాగంగా కూటమి ప్రభుత్వం అనూహ్య విజయాన్ని సాధించి, రాష్ట్ర ముఖ్యమంత్రిగా కుప్పం నియోజకవర్గ శాసనసభ్యులు నారా చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ పరిణామంతో రాష్ట్రవ్యాప్తంగా నామినేటెడ్ పదవులు అనుభవిస్తున్న వైసిపి నాయకులు తమ పదవులను వదులుకోవాల్సి వచ్చింది. అంతట తెలుగు తమ్ముళ్లు నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూశారు. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టి ఎనిమిది మాసాలు పూర్తి కావస్తున్న తరుణంలో ఇప్పటికే రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులలో అభ్యర్థులను టిడిపి ప్రభుత్వం నియమించడం జరిగింది. అయితే ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల కోసం తెలుగు తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా కుప్పం ప్రజలను రక్షిస్తూ, మూడు రాష్ట్రాల ప్రజల చేత పూజింపబడుతూ కుప్పం పట్టణంలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయ కమిటీ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందా అన్న ఉత్కంఠతో స్థానిక తెలుగు తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారు. ప్రతి సంవత్సరం మే నెలలో అమ్మవారి జాతర జరగడం సాంప్రదాయంగా వస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర సమయం దగ్గర పడుతున్న వేళ అమ్మవారి సేవకుడిగా ఎవరు వస్తారా...? అని కుప్పం ప్రజలతోపాటు అమ్మవారి భక్తాదులు సైతం ఎదురుచూస్తున్నారు. స్థానికంగా ప్రత్యేక గుర్తింపు కలిగిన అమ్మవారి ఆలయ అధ్యక్ష పదవి కోసం స్థానికంగా టిడిపి నాయకులు సైతం పోటీ పడుతున్నారు. ఎవరు ఎంత పోటీ పడ్డ పార్టీ అధినేత ఆదరణ పొందిన వారు మాత్రమే, అమ్మవారి ఆశీస్సులతో ఆలయ కమిటీ అధ్యక్షులుగా నియమితుల



వుతారన్నది జగమెరిగిన సత్యం. అయితే పార్టీ ఆవిర్భావం నుండి స్థానికంగా పార్టీ బలోపేతానికి పనిచేస్తూ, చంద్రబాబు నాయకత్వంలో కొనసాగుతున్న తెలుగు తమ్ముళ్లు సైతం గంగమ్మ దేవాలయ కమిటీ అధ్యక్ష పదవి కోసం ఎదురుచూస్తున్నారు. అందులో ముఖ్యంగా టిడిపి అధికారంలో ఉన్న, ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు అభిమా నిగా పార్టీ ఆవిర్భావం నుండి ఆయన నాయ కత్వంలో పనిచేస్తున్న బి ఎం కె రవి చంద్రబాబు ముందు వరసలో ఉన్నట్టు స్థానికంగా విస్తృత ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాములో స్థానికంగా తెలుగు తమ్ముళ్లు ఎన్నో ఇబ్బం దులను ఎదుర్కొని పార్టీ బలోపేతానికి, అధినేత విజయానికి కృషి చేశారన్నది అందరికీ విధితమే.



ముఖ్యంగా 2019కి ముందు టిడిపి ప్రభుత్వం ప్రారం భించిన అన్నా క్యాంటీన్ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చిందనే చెప్పాలి. ఈ విషయాన్ని గుర్తించిన పార్టీ అధినేత తిరిగి టిడిపి అధికారం చేపట్టగానే పేద ప్రజల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్ ను పునః ప్రారంభిస్తామని ప్రకటించడం జరిగింది. అధినేత చంద్రబాబు పిలుపు మేరకు కుప్పం నియోజకవర్గ కేంద్రంలో పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా బి ఎం కె రవిచంద్రబాబు తన కుమార్తె జన్మదిన పురస్కరించుకొని అన్నా క్యాంటీన్ ను పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహ ఆవరణలో ప్రారంభించడం జరిగింది. ఎన్ని అవరోధాలు ఎదురైనా, కృంగిపోకుండా ప్రతినిత్యం రోజుకు 500 మందికి పైగా అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించారు. పలువురు తెలుగు తమ్ముళ్లు, స్థానిక ప్రజలు సైతం అన్నా క్యాంటీన్ నిర్వహణకు సహాయ సహకారాలు అందించడం రవి చంద్రబాబు దీక్ష పట్టుదలకు నిదర్శనంగా నిలిచింది. అన్నా క్యాంటీన్ నిర్వహణ వల్ల రోజు రోజుకు స్థానికంగా టిడిపికి ప్రజలలో వస్తున్న సానుభూతిని చూసి ఓర్వలేని అప్పటి అధికార వైసిపి నాయకులు స్వయాన బాబు పర్యటనలో అన్నా క్యాంటీన్ పై దాడి చేయడం జరిగింది. ఇందులో భాగంగా అన్నా క్యాంటీన్ నిర్వాహకులు అయిన రవిచంద్రబాబు పై సైతం వైసీపీ నాయకులు దాడి చేసి, కొట్టిన సందర్భాలు



లేకపోలేదు. ఇంతటి అవమానాలను సైతం భరించి, స్వప్రయోజనాల కన్నా.. పార్టీ ప్రయోజనాలే మిన్న అన్న సూత్రాన్ని నమ్మి పార్టీ బలోపేతానికి పనిచేసిన నాయకుడిగా రవిచంద్రబాబుకు కుప్పం ప్రజల్లోనూ, పార్టీలోనూ మంచి పేరు తెచ్చి పెట్టింది. పార్టీ బలోపేతానికి ఇంతగా పని చేసినా ఏనాడు ఉన్నత పదవులను ఆశించని రవిచంద్రబాబు తిరుపతి గంగమాంబ భక్తుడిగా అమ్మవారికి సేవ చేయడానికి ముందుంటారన్నది కుప్పం పట్టన ప్రజల మాట. అటువంటి వ్యక్తి గంగమాంబ ఆలయ కమిటీ అధ్యక్షులుగా నియమింప బడితే అమ్మవారికి ప్రతిష్టాలను మరింత పెంచేలా పనిచేస్తారని ఆయన అనుచర గణంతో పాటు స్థానిక ప్రజలు ఎదురుచూస్తున్నారు.

**కుప్పంలో అన్నా క్యాంటీన్ ను నిలబెట్టిన వ్యక్తి:** చంద్రబాబు నాయుడు రాష్ట్రం మొత్తం అన్నా క్యాంటీన్లు ప్రారంభించి పేదలకు ఐదు రూపాయలకే అన్నం పెట్టాలని ఉద్దేశంతో అన్నా క్యాంటీన్ ప్రారంభానికి పిలుపునిచ్చారు. ఆయన పిలుపు అందుకున్న రవిచంద్రబాబు తానే అన్ని అయి అన్నా క్యాంటీన్ ను నడిపిస్తూ వచ్చారు. దాతలు సహాయం చేసిన చేయకపోయినా తన సొంత నిధులతో అన్నా క్యాంటీన్ ను నడిపారు. గత టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం సజావుగా సాగినా 2019లో వైఎస్ఆర్సిపి రాగానే రవిచంద్రబాబుకు ఇబ్బందులు పెట్టడం ప్రారంభించారు. అనేక మార్లు బ్యానర్లు చింపడం, భోజనం తరలించే ట్రాక్టర్లను ఆపడం, ఇదేమని ప్రశ్నిస్తే రవిచంద్రబాబు పై దాడికి పాల్పడిన సంఘటనలు లేకపోలేదు. అయినా రవిచంద్రబాబు వెరవక అన్ని తానై కష్ట కాలంలోనూ అన్నా క్యాంటీన్‌ను నడిపించారు.

# ఏడవ తరగతిలో నలుగురు..!

## – ఎనిమిదవ తరగతిలో ఐదుగురు..! – ఇదీ చలమంగళం ప్రాథమికోన్నత పాఠశాల తీరు

పెద్దపంజాణి, మేజర్ న్యూస్: పెద్దపంజాణి విద్యాశాఖపై పలువురు ప్రజా ప్రతినిధులు మండిపడినా పెద్దపంజాణి మండల విద్యాశాఖ అధికారుల తీరు ఏమాత్రం మార్పు లేదనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. పెద్దపంజాణిమండలం లోనిచలమంగళంగ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడవ తరగతిలో నలుగురు ఎనిమిదో తరగతిలో ఐదు మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కాగా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల బోధన సరిగా లేదని మండల కేంద్రంలోని పెద్దపంజాణి ఉన్నత పాఠశాలకు విద్యార్థులు తరలి వెళ్లారనేది గ్రామస్తుల మాట. మండల విద్యాశాఖ అధికారుల పని తీరుపై మండల సర్వసభ్య సమావేశంలో మండల ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. మండలంలో విద్యాశాఖ అధికారులు ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కేవలం ఉన్నత పాఠశాల పర్యవేక్షణకే పరిమితమౌతున్నారని సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు నిలదీశారు. తుర్లపల్లి, నగిరేపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేక మూసివేత దిశగా ఉన్నా పెద్దపంజాణి మండలంలోని విద్యాశాఖ అధికారులు కనీసం సంబందిత గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించలేకపోవడం పై కూడా ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల తల్లితండ్రులు ప్రైవేట్ పాఠశాలలో చేరుస్తున్నారని, ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకోకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని అధికారులను ప్రజా ప్రతినిధులు నిలదీశారు. ప్రభుత్వ



పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకోకుం డా ప్రభుత్వ బడులు మూతపడే దిశగా వ్యవహరిస్తున్నారని మండలంలో పలువురు చర్చించుకుంటున్నారు. డ్రాపౌట్స్ నియంత్రణ, పాఠశాలల వరిశీలన సక్రమంగా జరగలేదని, మధ్యాహ్నం భోజన పథకాన్ని కూడా తూతూ మంత్రంగా విద్యాశాఖ అధికారులు తనిఖీ చేస్తున్నారనే విమర్శలు మండలంలో బలంగా వినిపిస్తున్నాయి. ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంలో పెద్దపంజాణి మండల విద్యాశాఖ అధికారులు విఫలమౌతున్నారనని పలువురు బాహాటంగా చర్చించుకుంటున్నారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తేనే ప్రాథమికోన్నత, ఉన్నత విద్యకు విద్యార్థులు హాజరవుతారన్న విషయాన్ని మండల స్థాయి విద్యాశాఖాధికారులు మరిచిపోయారని ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు. పలు పాఠశాలలకు ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరు కాలేదనే విమర్శలు కూడా మండలంలో జోరుగా వినిపిస్తున్నాయి. దీనిపై ఎంఈఓ లను వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులో లేరు.

# పవిత్ర పుణ్యస్థలం నామాల కాలువ..

## – ఎంపీడీవో ఇందిరమ్మ పుణ్య స్థానాలు

రామచంద్రపురం, మేజర్ న్యూస్: అతి పవిత్రమైన స్థలం నామాల కాలువ అని రామచంద్రాపురం మండలం ఎంపీడీవో ఇందిరమ్మ అన్నారు. బుధవారం ఎంపీడీవో మండలంలోని కొత్త నెన్నూరు దగ్గర సాక్షాత్తు శ్రీ వారు స్నానం ఆచరించి నామాలు తరించిన కాలువ గట్టుపై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తులు చందాలు వేసుకొని ఆ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తర్వాత గ్రామస్తులచే ఆ యొక్క పవిత్ర స్థలం విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వర స్వామి వారు నారాయణవనంలో పద్మావతి అమ్మవారిని పరిణయం ఆడి యోగుల పర్వతంపై ఉన్న సిద్ధ పురుషులకు యోగులకు అభయం ఇచ్చిన తర్వాత సాక్షాత్తు ఈ యొక్క కాలవలో స్నానం ఆచరించి నామాలు ధరించిన కారణంగా ఈ యొక్క కాలువకు నామాల కాలువగా పెరుగంచిందన్నారు. అటువంటి పవిత్ర స్థలంలో గత కొద్ది రోజులకు ముందుగా శ్రీవారి విగ్రహం దొరకడం ఎంతో అదృష్టకరమన్నారు. స్వామివారిని చూస్తుంటే రెండు కన్నులు చాలా లేదన్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం రోడ్డును ఏర్పాటు చేయడంతో పాటు ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

